క్లుప్తంగా

కరాటే విజేతలకు అభినందన



విద్యార్థులతో అధికారులు

పెద్దపల్లిరూరల్/ఓదెల: కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచిన ఓదెల మండలం హరిపురం పాఠశాల విద్యార్థులను అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, డీఈవో మాధవి అభినందించారు. కరాటే పోటీల్లో రాణించిన వారిని ఇతర విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. షేక్, అజీముద్దీన్, కవిత, మల్లేశం ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గోదావరిఖనిటౌన్: గోదావరిఖనిలోని గాంధీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం డీఎస్పీ డాక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ సీఐ కృష్ణమూర్తి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సైబర్ క్రైమ్ పోలీస్ సిబ్బంది కుమార్, కీర్తి, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేఫ్టీ జీఎంకు సన్మానం



జీఎంను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన సందనాల సాంబయ్య దంపతులను మంగళవారం యైటింక్లయిన్‌కాలనీ విశ్వకర్మ శివాలయం కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఆలయంలో జీఎం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగులమల్యాల రాజమౌళిచార్యులు, అర్చకులు శ్రీనివాస్, కమిటీ సభ్యులు వెంకటస్వామి, రాజనర్సయ్య, ప్రకాశ్‌చారి, లక్ష్మీరాజం, శంకరయ్య, రవీంద్రచారి, లక్ష్మనారాయణ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విద్యార్థుల సాయం



నగదు అందజేస్తున్న విద్యార్థులు

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్‌లోని గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు శ్రీసాయి అనాథ వృద్ధాశ్రమానికి నగదు అందజేశారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ ఆర్.కె.5 కాలనీలో గల శ్రీసాయి అనాథ వృద్ధాశ్రమానికి విద్యార్థులు రూ.20,024 విరాళాల సేకరించారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులకు అందించారు. పాఠశాల కరస్పాండెంట్ సత్యం, ప్రిన్సిపాల్ సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బీసీకాలనీకి చెందిన మందల సంపత్‌రెడ్డి కుటుంబానికి ఎస్‌బీఐ సంస్థ ఆధ్వర్యంలో ప్రమాదబీమా చెక్కును మంగళవారం బ్యాంక్ అధికారులు అందజేశారు. గతంలో సంపత్‌రెడ్డి బసంత్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.1000 చెల్లించి రూ.20లక్షల ప్రమాదబీమా పాలసీ తీసుకున్నాడు. గతేదాది జూన్‌లో రామగుండం సమీపంలోని మల్యాలపల్లి సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంపత్‌రెడ్డి మృతిచెందాడు. మంజూరైన చెక్కును ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అనుపమ్ ఆదర్శ్ మృతుడి భార్య లావణ్యకు అందజేశారు. బసంత్‌నగర్ బ్యాంక్ మేనేజర్ జగదీశ్, సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో పారిశుధ్య పనులను కొనసాగుతున్నారు. అధికారుల ఆదేశాలతో గ్రామంలో పంచాయతీ కార్మికులతో, ఉపాధి హామీ కూలీలతో రోడ్డు వెంట చెత్త తొలగింపు, డ్రైనేజీల్లో సిల్టు తొలగింపు పనులు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శితో పాటు కారోబార్, సిబ్బంది పాల్గొన్నారు.

దారి ఇలా.. వెళ్లేదెలా?

- జాతరకు వెళ్లే భక్తులకు తప్పని తిప్పలు
- రహదారులకు మరమ్మతు చేయాలని వినతి



పెద్దంపేట భూగర్భ వంతెన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని గోదావరి నది ఒడ్డున వైభవంగా జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర గడువు సమీపిస్తున్నా సంబంధిత అధికారులు రహదారులపై దృష్టిపెట్టడం లేదు. వేలాది మంది భక్తులు తమ తమ వాహనాల ద్వారా పెద్దంపేట, అంతర్గాం మీదుగా జాతరకు రాకపోకలు సాగిస్తారు. కాగా పెద్దంపేట రైల్వేగేట్‌ను తప్పించి నేరుగా విలేజి అంతర్గాం సమీపానికి చేరుకునే బైపాస్ రహదారిలో ఉన్న భూగర్భ రైల్వేవంతెన వద్ద రహదారి అస్తవ్యస్తంగా ఉంది. వంతెనకు ఇరువైపులా గుంతల్లో నీరు నిలిచి కనీసం నడిచి వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీన్ని మట్టితో పునరుద్ధరించి వాహనాల రాకపోకలు సవ్యంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే రామగుండం రైల్వేస్టేషన్ మీదుగా వచ్చే భక్తులు గురుకుల విద్యాలయం మీదుగా రాకపోకలు సాగించాలి. కాగా ముస్లిం శ్మశాన వాటిక వద్ద ఉన్న భారీ గుంతలను పూడ్చి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిహారం తేల్చేదాకా భూములు ఇచ్చేది లేదు



ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులు

ముత్తారం: జాతీయ రహదారి నిర్మాణం కోసం ముత్తారంలో మంగళవారం చేపట్టిన భూసేకరణ సభలో భూనిర్వాసితులు తమ భూములకు పరిహారం తెల్చేదాకా భూములు ఇవ్వబోమని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో మంథని ఆర్డీవో హనుమానాయక్ రైతులతో మాట్లాడారు. భూములు కోల్పోయిన రైతులకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తామని వివరించారు. దీనికి రైతులు ససేమిరా అంటూ మార్కెట్ ధరకు మూడింతలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం వస్తుందని, మీరు అవసరమైతే కోర్టుకు వెళ్లాలని ఆర్డీవో అనడంతో సహనం కోల్పోయిన రైతులు సభ నుంచి బయటకు వచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. తమ భూములకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని భూనిర్వాసిత రైతులు పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో మండలంలోని ఓడేడ్‌లో భూనిర్వాసితులతో సమావేశమై భూసేకరణపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని కేరళ మోడల్ హైస్కూల్ కు విద్యార్థి డి.ప్రచేతన్, 19వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ సిజ్జు.ఎస్.నాయర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ సర్దార్ పటేల్ స్టేడియంలో 16 నుంచి 18 వరకు జరిగే జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థిని పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థికి కరస్పాండెంట్ క్రీడా దుస్తులు అందజేశారు.

పెద్దపల్లి ఎంపీ స్థానం మాదిగలకే కేటాయించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

సుల్తానాబాద్: పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల, పెద్దపల్లి జిల్లా నాయకులతో సుల్తానాబాద్‌లో మాదిగ ఐక్యవేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో రెండు లక్షల 80వేల ఓట్లు ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో మాదిగలకు టికెట్ ఇచ్చిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెండు జిల్లాల నాయకులు కోటగిరి పాపయ్య, కాంపల్లి ప్రభాకర్, పల్లె సదానందం, పోచయ్య, బాపయ్య, ప్రభాకర్, లక్ష్మణ్, తిరుపతి, శంకర్, భీమ్‌రావు, భూమయ్య, రమేశ్ ఉన్నారు.

ఉద్యోగులు సమ్మెకు దూరంగా ఉండాలి

గోదావరిఖని: దేశవ్యాప్త ఒక్కరోజు సమ్మెకు సింగరేణి ఉద్యోగులు దూరంగా ఉండాలని ఆర్జీ-2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 16న జాతీయ సంఘాలు తలపెట్టిన ఒక్కరోజు టోకెన్ సమ్మెకు సింగరేణికి సంబంధం లేదన్నారు. ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతున్న క్రమంలో ఉత్పత్తి లక్ష్యాలు సాధించే దిశగా సింగరేణి ముందుకు వెళ్తున్న తరుణంలో సమ్మెలతో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సమ్మె డిమాండ్లు సింగరేణి పరిధిలోనివి కావన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సమస్యలకు సింగరేణిలో సమ్మె చేయడం సరికాదన్నారు. సింగరేణి ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు గమనించి సమ్మెకు దూరంగా ఉండాలని వారు సూచించారు.

జేఈఈలో ప్రతిభ



విపుల్ చంద్ర

రామగుండం: బీ-థర్మల్ విద్యుత్‌కేంద్రంలో ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న గుడిసె వీరేందర్ తనయుడు విపుల్ చంద్ర మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో తొలి ప్రయత్నంలోనే 99.022 పర్సంటైల్ సాధించాడు. అత్యుత్తమ మార్కులు సాధించిన విపుల్‌ను బంధువులు, స్థానికులు అభినందించారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు

రామగిరి: క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్జీ-3 ఏరియా కారుణ్య నియామకాల ద్వారా 178 మంది ఉద్యోగులకు స్థానిక ఎంవీటీసీ శిక్షణకు ఉత్తర్వులు జారీ చేశారు. వారిని ఉద్దేశించి మంగళవారం ఏపీఏ జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టమని, సంస్థ అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సింగరేణి సంస్థలో ఉన్నత ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ప్రస్తుతం చాలా ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్‌వోటూ జీఎం డి.బైద్య, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, వీటీసీ మేనేజర్ మల్లన్న, డీవైఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి హద్దుల గుర్తింపు



హద్దులను గుర్తిస్తున్న ఏడీఏ

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం రెవెన్యూ అధికారులు గుర్తించిన స్థలంలో మంగళవారం ఏడీఏ కనుకయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కొలతలు తీసి హద్దులు ఏర్పాటు చేశారు. రెండేళ్ల క్రితం మండలంలోని బంజేరుపల్లికి మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్‌కు బంజేరుపల్లిలో కానీ పెర్కపల్లిలో కానీ ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు స్థలం చూపించడంలో విఫలమయ్యారు. దీంతో కటికెనపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రేండ్ల నరేశ్ బంజేరుపల్లికి రెవెన్యూ గ్రామమైన కటికెనపల్లిలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను కోరారు. అయితే ప్రభుత్వ స్థలం చూపించాలని అధికారులు సూచించగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి సహకారంతో గ్రామశివారులోని స్థలాన్ని చూపించుడానికి అనేక ప్రయత్నాలు చేసి చివరికి రెవెన్యూ అధికారులతో స్థలాన్ని ఎంపిక చేయించారు. దీంతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి విద్యుత్‌శాఖ సివిల్ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు పనులు ప్రారంభించడానికి హద్దులు ఏర్పాటు చేశారు.

దళితులకు అండగా ఉంటాం

యైటింక్లయిన్‌కాలనీ: సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా, విద్యాపరంగా, సాంస్కృతికంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వారికి అండగా ఉంటామని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు అన్నారు. మంగళవారం రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన రామగిరి మండలం వెంకట్రావుపల్లికి సంబంధించిన నూతన కమిటీని ప్రకటించి మాట్లాడారు. గ్రామశాఖ నూతన అధ్యక్షుడు బోగి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు సతీశ్, రాజయ్య, వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఓదెలు, కార్యవర్గ సభ్యులు లక్ష్మయ్య, రాజమల్లు, వాసు, సంపత్, విజయ్, అనిల్, సురేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామశాఖ నిర్మాణ కమిటీ బాధ్యులు బూడిద సమ్మయ్య, మేకల సురేశ్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీశ్, కార్యదర్శి లింగయ్య, ఆర్జీ-2 ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సరోజినీ, రమేశ్ పాల్గొన్నారు.

రైతుల అరెస్టుకు నిరసనగా రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

ఓదెల: దేశ రాజధానిలో గిట్టుబాటు ధరకోసం నిరసన చేస్తున్న రైతులను అకారణంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని కొలనూర్‌లో పొత్కపల్లి సొసైటీ మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎడ్లబండ్లతో మంగళవారం రాస్తారోకో చేశారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జాతీయ రైతుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తుంటే అకారణంగా కేంద్రప్రభుత్వం అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. మాజీ సర్పంచులు బొంగోని రాజయ్యగౌడ్, మారవేని రామస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్యయాదవ్, రైతులు కాసారపు ఐలయ్యగౌడ్, కె.శ్రీనివాస్, మహేశ్, పున్నారెడ్డి, లింగయ్య, శ్రీకాంత్, అరవింద్, కిట్టస్వామి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అభినందిస్తున్న జిల్లా విద్యాధికారి

ధర్మారం: మండలంలోని నందిమేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఏంపెల్లి జోషిత రాష్ట్రస్థాయి ఆంగ్లభాష ప్రతిభా పరీక్షకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వసంత తెలిపారు. ఆంగ్లభాష పట్టుపై 8, 9 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎల్టా ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాకేంద్రంలో నిర్వహించిన స్పెల్ విజార్డ్‌లో ప్రతిభ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనపబరిచి మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని జిల్లా విద్యాధికారి మాధవి, ఎల్టా జిల్లా కన్వీనర్ వంగ అశోక్, జిల్లా కార్యదర్శి నాగరాజు, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుడు బి.రాజ్‌కుమార్, హెచ్‌ఎం అభినందించారు.

సమ్మెను జయప్రదం చేయాలి



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: దేశవ్యాప్తంగా 16న జరగనున్న సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నేత ఐ.కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో దాసరి మొండయ్య 21వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు నరేశ్, బి.అశోక్, ఎం.దుర్గయ్య, ఎడ్ల.రవికుమార్, ఎం.కొమరయ్య, లింగమూర్తి, ధర్మేందర్ పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న చేపట్టిన దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ కోరారు. మంగళవారం ఆర్జీ-2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్ వన్ ఎన్‌సీ క్వార్టర్స్ ఏరియా వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన ప్రచార పత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఎ.రమేశ్, దుర్గేష్, లింగయ్య, సమ్మయ్య, శంకరమ్మ, సుభద్ర, రాజబాబు, లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తిలో ఉచిత వైద్యశిబిరం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని స్ఫూర్తి మానసిక దివ్యాంగుల కేంద్రంలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఎలైట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మానసిక దివ్యాంగులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. క్లబ్ రీజినల్ చైర్మన్ అశోక్‌కుమార్, భిక్షపతి, వెంకటేశ్, అతీఫ్ ఉన్నారు.

అమరుల వారసత్వాన్ని కొనసాగిద్దాం

జ్యోతినగర్: అమరుల వారసత్వాన్ని కొనసాగిద్దామని సీపీఐ(ఎంఎల్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దాసరి మొండన్న వర్ధంతి సభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చివరి శ్వాస వరకు విప్లవోద్యమ నిర్మాణానికి కృషిచేసిన అమరుడు మొండన్న అని గుర్తు చేశారు. బొగ్గు బావులపై దొరలకు వ్యతిరేకంగా ఎదురు నిలిచి ఉద్యమాలు కొనసాగించాడని, తన కుటుంబాన్ని సైతం లెక్క చేయకుండా తన జీవితాన్ని ప్రజల కోసం అర్పించిన మహానాయకుడని కొనియాడారు. సభలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర నాయకులు తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, రాములు, చంద్రయ్య, రాయమల్లు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ పోస్టాఫీస్‌లో నూతనంగా ఆధార్ సేవ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. పెద్దపల్లి సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ప్రభాకర్ అతిథిగా పాల్గొని కేంద్రాన్ని ప్రారంభించారు. ఆధార్‌కార్డులో మొబైల్ నెంబర్, అడ్రస్ మార్పునకు, నూతన ఆధార్‌కార్డు తీసుకోవడానికి కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ పెద్దపల్లి నరేశ్, పోస్టుమాస్టర్ ఓదెలు, వికాస్, సతీశ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న సంఘం నాయకులు

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె గ్రామ పరిధిలోని శాలపల్లెకు చెందిన మాటేటి రమేశ్ అనే నిరుపేద రైతు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా మృతుడి కుటుంబానికి పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో క్వింటాల్ బియ్యంతో పాటు మిత్రబృందం సభ్యులు రూ.30వేలు అందజేశారు. పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, బత్తుల సమ్మయ్య, గడ్డం శ్రీనివాస్, కొలిపాక వెంకన్న, హరీశ్, శంకరయ్య పాల్గొన్నారు.

సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ బదిలీ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ శ్యాముల్ ఆనందరావు వరంగల్ అర్బన్‌కు బదిలీ అయ్యారు. పాల్వంచలో ఉన్న గురునాథ్ సుల్తానాబాద్‌కు బదిలీపై రానున్నారు. సోమవారం రాత్రి ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్సైజ్ ఎస్సై కే.ఎస్.సత్యనారాయణ హన్మకొండ నుంచి సుల్తానాబాద్‌కు బదిలీపై రానున్నారు.

విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం



దగ్ధమైన వస్తువులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కొదురుపాకకు చెందిన కందుకూరి సుభాష్ ఇంట్లో మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్ వెల్డింగ్ వర్క్స్ పనిచేస్తుండగా భార్య రమ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం ఇంటికి తాళం వేసి భార్యభర్తలు ఎవరి పనికి వారు వెళ్లగా పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లోంచి పొగ రావడంతో చుట్టు ప్రక్కల వారు గమనించి సుభాష్‌కు సమాచారం అందించారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి అప్పటికే సామాగ్రి పూర్తిగా కాలిపోయింది. రూ.25వేల నగదు, తులం బంగారం, బెడ్లు, బట్టలు, బియ్యం, ఎలక్ట్రిక్ వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. సుమారు రూ.3లక్షలపైగా నష్టం వాటిల్లిందన్నారు. సుభాష్‌ను ఆదుకోవాలని నాయకుడు రాజాగౌడ్ కోరారు.

సంక్షిప్త వార్తలు

★ ఉరేసుకొని ఒకరి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని చిన్నకల్వలకు చెందిన సుధీర్‌కుమార్(37) మంగళవారం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వినీత, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలో సుగ్లాంపల్లిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్‌కు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడికి రెండేళ్ల క్రితం పెళ్లయింది. వారం క్రితం భార్య అవని పుట్టింటికి వెళ్లగా, మంగళవారం తల్లి స్వర్ణ ఉద్యోగ విధులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు, ఫిర్యాదు ఇంకా ఇవ్వలేదని ఎస్సై పేర్కొన్నారు.

★ బైక్ చోరీ

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న గోదావరిఖని ప్రాంతానికి చెందిన బోరం తిరుపతి బైక్ చోరీకి గురైంది. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులోని సీఅండ్‌ఐ విభాగంలో విధులు నిర్వహిస్తున్న తిరుపతి మంగళవారం తన బైక్‌ను లేబర్ గేట్ సమీపంలోని ఓ హోటల్ వద్ద పార్కింగ్ చేసి తన పని నిమిత్తం రామగుండం వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీంతో ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితుడు తెలిపారు.

★ వ్యవసాయ మార్కెట్ కమిటీ రద్దు

కమాన్‌పూర్: కమాన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీని రద్దు చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏఎంసీ కార్యదర్శి ఈర్ల సురేందర్ తెలిపారు.

★ సమ్మక్క జాతరకు ఏర్పాట్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటలో సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయని జాతర కమిటీ చైర్మన్ ముత్యాల రాజయ్య తెలిపారు.

★ మరమ్మతు పనులు ముమ్మరం

కాల్వశ్రీరాంపూర్: వనదేవతల జాతరకు వెళ్లే రహదారులపై జాతర అభివృద్ధి కమిటీ నేతృత్వంలో మొరంపోసి మరమ్మతు పనులు చేస్తున్నారు. మండలంలోని మీర్జంపేట, పెగడపల్లి, పెద్దరాతుపల్లి గ్రామాల్లో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా మొరంపోసి చదును చేస్తున్నారు.

★ ఆత్మరక్షణ ఆయుధం కరాటే

కాల్వశ్రీరాంపూర్: కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నేతృత్వంలో ఇటీవల నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ కరాటే పోటీల్లో కాల్వశ్రీరాంపూర్ కేజీబీవీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థినులను ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ శనవేన రవితేజ, మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు రానవేన సీను అభినందించారు.

★ బ్యాంకు ఖాతాలో డబ్బులు మాయం

ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తికి చెందిన ధారవేని పోచాలుకు చెందిన బ్యాంక్ అకౌంట్ నుంచి ఆధార్ నెంబర్, వేలి ముద్ర సహకారంతో రూ.29,500 గుర్తుతెలియని వ్యక్తులు డ్రా చేసుకున్నట్లు ధర్మారం ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం ద్వారా సైబర్ నేరగాళ్లు మూడు విడతలుగా రూ.10వేలు, రూ.9500, రూ.10వేలు విత్‌డ్రా చేశారని పోచాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

★ సైబర్ మోసంపై ఫిర్యాదు

జ్యోతినగర్: సైబర్ నేరాళ్లు మోసం చేసిన ఘటనపై ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.జీవన్ తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌కు చెందిన ఎం.అవినాష్ తన మొబైల్‌లోని ఓ యాప్‌లో ఆన్‌లైన్ జాబ్ కోసం టాస్క్‌లో పాల్గొని రూ.17,80,000 గత నెల జనవరిలో డిపాజిట్ చేశాడు. నెల గడిచినా ఎలాంటి సమాచారం లేకపోవడంతో పాటు తను డిపాజిట్ చేసిన నగదు రాకపోవడంతో సైబర్ మోసానికి గురైనట్లు భావించాడు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై జీవన్ సైబర్ కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

★ ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో మంగళవారం ఎయిడ్స్ నియంత్రణపై జనజాగృతి వేదిక గడ్డం రమేశ్ కళాబృందం అవగాహన కల్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోనే చేరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మెరుగైన వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులున్నారని, ఇంటర్ పాసైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోనే ప్రవేశం పొందాలని ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య కోరారు. కళాశాల ఆవరణలో మంగళవారం ప్రవేశ పోస్టర్‌ను అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. జిమ్‌తో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సౌకర్యాలు, విద్యార్థినులు ఉండేందుకు కాలేజీ ఆవరణలోనే వసతిగృహం ఉందని తెలిపారు. డిగ్రీ తరగతుల్లో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ పెద్దపల్లి-7006ను దోస్త్ ద్వారా ఎంచుకోవాలని సూచించారు.